క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేయాలి

నడిగూడెం : త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం పని చేయాలని బీజేపీ కోదాడ నియోజవర్గం ఎన్నికల కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండారు వీరబాబు, నాయకులు మూలగ భిక్షంరెడ్డి, సుంకర లింగారెడ్డి, నాగేంద్రచారి, కొండ్లె రవి, రౌతు కళ్యాణ్, కేశగాని పాపయ్య, నూకపంగు గుర్వయ్య, మామిడి రామకృష్ణ, రాజుల వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి, ఎర్రకుంట ప్రాథమిక పాఠశాలలో 70మంది విద్యార్థులకు మాజీ సర్పంచ్ మాశెట్టి నాగలక్ష్మి శ్రీహరి షూ పంపిణీ చేశారు. విద్యార్థులకు రూ.15వేల విలువ గల షూ పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్న మాశెట్టి నాగలక్ష్మి శ్రీహరిని ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, రమేష్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోదేశి దయాకర్, పిన్నెని రాంబాబు, సైదులు, శిరీష పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మేళ్లచెరువు : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం మేళ్లచెరువులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారిలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జానీ, రహీం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక ప్రసంగం



కాల్వపల్లిలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న మందిర నిర్వాహకులు

గరిడేపల్లి: మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామంలో గల సాయిబాబా మందిరంలో గురువారం హుజూర్‌నగర్ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి త్రివిక్రమానంద సరస్వతి స్వామిజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హుజూర్‌నగర్ వెంకటలక్ష్మి హుండీ లెక్కింపు బృందం మహిళలు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా మందిర నిర్వాహకులు ముక్కా ధనేష్‌రావు, ఆలయ అర్చకులు రామ్‌సింగ్, సామాజిక కార్యకర్తల ఆకుల రాము, దూళిపాల రామకృష్ణశర్మ, శ్యాంసుందర్, బూరుగు శ్రీను, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కోదాడరూరల్: కోదాడ మండలం దోరకుంట గ్రామ శివారులో పేకాట స్థావరంపై కోదాడ రూరల్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్. గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోరకుంట గ్రామ శివారులోని అశోక్ లేలాండ్ షోరూం వెనుక కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోదాడకు చెందిన మాదంశెట్టి సత్యనారాయణ, తమ్మర గ్రామానికి చెందిన లెక్కల నరసింహారావు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.5450 నగదు, రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాగులో పూడికతీత

నడిగూడెం : కురుస్తున్న వర్షాలతో నడిగూడెంలోని బీసీ, ఎస్సీ కాలనీలలో పలు చోట్ల కంప చెట్లు తొలగించడంతో పాటు, వరద నీరు సారంగేశ్వరస్వామి చెరువులోకి వెళ్లే విధంగా పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి గురువారం వాగులో పూడిక తీయించారు. వర్షపు నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి పోకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పంచాయతీ కార్యదర్శిని స్థానికులు అభినందించారు.

మూసీ దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట : రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మూసీ ప్రాజెక్టులో 1427క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నందున శుక్రవారం ఉదయం మూసీ ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల నుంచి 1260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ 1వ నంబర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం తెలిపారు. మూసీ దిగువన ఉన్న ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

పశువైద్యశాలలో సిబ్బంది కొరత

- మూగజీవాలకు అందని వైద్యం
- శిథిలావస్థకు చేరుకున్న సబ్ సెంటర్ల భవనాలు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు



గణపవరం పశువైద్యశాల

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన గణపవరం పశువైద్య సబ్ సెంటర్‌లో సిబ్బంది లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లుగా ఇక్కడ వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందని పరిస్థితి నెలకొంది. తొగర్రాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారంలో రెండు రోజులు ఇన్‌చార్జ్‌గా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా తొగర్రాయి, నల్లబండగూడెం, కొమరబండ, చిమిర్యాల సబ్ సెంటర్లలో కూడా అటెండర్ పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగానే ఉంటున్నాయి. వైద్య సిబ్బంది లేకపోవడంతో దూరంగా ఉన్నచోటకు పశువులు, జీవాలను తీసుకెళ్లేందుకు రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం అన్ని పశువైద్యశాలలు, సబ్‌సెంటర్‌లలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని పాడి రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న సబ్‌సెంటర్ల భవనాలు

మండలంలోని పలు సబ్ సెంటర్ల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నల్లబండగూడెంలో నూతనంగా భవనం నిర్మించగా మిగిలిన గణపవరం, కొమరబండ, చిమిర్యాల సెంటర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తొగర్రాయి సబ్ సెంటర్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు.

వైద్య సిబ్బందిని నియమించాలి



గణపవరం పశువైద్యశాల సబ్‌సెంటర్‌లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి పాడి, జీవాల పెంపకం దారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. ఇక్కడ జీవాలు, గేదెలపై ఆధారపడి అనేక మంది రైతులు ఉన్నారు. వైద్య సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

– ఇర్ల సీతారాంరెడ్డి, గణపవరం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

మండలంలో ఖాళీగా ఉన్న గణపవరం, తొగర్రాయి సబ్ సెంటర్లలో సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. త్వరలోనే నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ రెండు చోట్ల ఇన్‌చార్జులను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– డాక్టర్ మధు, మండల పశువైద్యాధికారి, కోదాడ

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

నేరేడుచర్ల : నేరేడుచర్లతోపాటు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి గురువారం స్థానికంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి,, నూకల సందీప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీను, పేరబోయిన వీరయ్య, ఆదిరెడ్డి, రంగారెడ్డి, అజయ్, ప్రవీణ్, కృష్ణమూర్తి, వినోద్, మనోజ్, రాములు, మంగయ్య తదితరులున్నారు.

బీసీ బిల్లు ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

హుజూర్‌నగర్ : బీసీ బిల్లు ఆర్డినెన్స్‌కు గవర్నర్ తక్షణమే ఆమోదం తెలపాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు ఐక్యంగా నిలబడి రిజర్వేషన్ సాధించుకోవాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు అడ్డుకునే పార్టీలను రాజకీయ సమాధి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు జడ శ్రీనివాస్, జక్కుల రమేష్, కొమర్రాజు వెంకట్, జక్కుల రమణ పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోకపోతే నిరవధిక దీక్ష చేస్తాం



చిలుకూరులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కనగాల నారాయణ

చిలుకూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో విడతల వారీగా నిరవధిక దీక్షలు చేపడతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కనగాల నారాయణ అన్నారు. గురువారం చిలుకూరులో నిర్వహించిన బీజేపీ ఎన్నికల వర్క్‌షాపు మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీజేపీ నాయకులపై ఉందన్నారు. రానున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిపిరిశెట్టి బసవయ్య, చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్, కొడారు రాము, మీసాల మట్టయ్య, నాగాచారి, కట్టెకోల వెంకన్న, బోడ అనిల్ కుమార్, సతీష్, కొండా శ్రీను, బాణోతు సందీప్, పాండు నాయక్, బోస్, ఉపేందర్, కోటేష్, నాగరాజు, గిరిజన, రవి నాయక్, కాశయ్య పాల్గొన్నారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని వినతి



తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నేరేడుచర్ల : ఉపాధ్యాయ, విద్యారంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల తహసీల్దార్ సురగి సైదులుకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నేతలు మాట్లాడుతూ.. అన్ని రకాల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, పీఆర్‌సీ నివేదికను తెప్పించుకొని 2023 జూలై 1వ తేదీ నుంచి అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కమిటీ నాయకులు శ్రీనయ్య, అక్కయ్యబాబు, మాధవి, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, వెంకటేశ్వర్‌రావు, కృష్ణయ్య, జానయ్య, యాదగిరి, హన్రూన్, వరప్రసాద్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

సేవలు వినియోగించుకోవాలి



గర్భిణులను వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న 102 సిబ్బంది

నేరేడుచర్ల: గర్భిణులు, బాలింతలు 102, 108, 1962 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సలీం, సూర్యాపేట జిల్లా మేనేజర్ శివరాములు కోరారు. గురువారం వివిధ గ్రామాల గర్భిణులు, బాలింతలను నేరేడుచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో 102 సిబ్బంది అజయ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ లెజెండ్ వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పైడిమర్రి సతీష్, రామ నరేష్, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ నాయకులు పాపారావు, వెంకటేశ్వర్లు, ఝాన్సీరాణి వెంకటేశ్వర్లు, ప్రవళిక, హరీష్, లీల, చిన్న నరసింహారావు, వెంకటనారాయణ, దయాకర్, నాని, ఆదినారాయణ, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ప్రవీణ్, దుర్గా ప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చైతన్య యాత్రలను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : కల్లు గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన సంఘం నాయకులను స్మరిస్తూ నిర్వహించే చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని వృత్తి సంఘాల భవనంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న బొలగాని పుల్లయ్య 37వ వర్ధంతి నుంచి 18న సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వరకు అన్ని జిల్లాల్లో సభలు సమావేశాలు జరిపి అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలపాలన్నారు. బైక్ ర్యాలీలు, పాటల పోటీలు, ఆటల పోటీలు, రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, రోగులకు పండ్లు పంపిణీ, తదితర కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

గుర్రం జాషువాకు నివాళి



గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్లో గురువారం గుర్రం జాషువా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గుర్రం జాషువా సాహిత్య వేదిక కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా బయ్యారపు రామారావు, అధ్యక్షుడిగా బయ్యారపు రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా మీసాల వీరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయ సలహాదారుగా వేల్పుల మోషే, కార్యదర్శిగా కొల్లోజు నాగేంద్ర చారి, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి మధుసూదన్, కోశాధికారి భీమపంగు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి తురక అంజయ్య, సహాయ కోశాధికారిగా కర్నే శ్రీను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో షేక్ సైదా, మీరా, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ డేను ఘనంగా నిర్వహించాలి

గరిడేపల్లి: ఈ నెల 26న రిజర్వేషన్ డే ఘనంగా నిర్వహించుకోవాలని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి నందిపాటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రవికుమార్, మద్దిపాటి సత్యం, సంపత్, నాగయ్య, రత్నం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి నందిపాటి ప్రభాకర్

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు



మందులు అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ : వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం హుజూర్‌నగర్ మండలంలోని వేపల సింగారం గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ట్రస్ట్, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పశువులు అనారోగ్యానికి గురైతే స్థానిక పశువైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం శిబిరంలో 42 ఎదకు రాని పశువులకు, 28 చూడు నిలవని పశువులకు, 8 అనారోగ్య పశువులకు పరీక్షలు నిర్వహించి వైద్యం చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు రూప్ కుమార్, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారులు నట్టల నివారణ మందు వేయించాలి

చిలుకూరు: గొర్రెలు, మేకల పెంపకందారులు తప్పనిసరిగా తమ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుర్ర అచ్చయ్య, పల్లా ఉపేందర్, పశువైద్య సిబ్బంది నీరజ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కోదాడరూరల్ : మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ దాచేపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలను ఆయన సందర్శించి మొక్కలు నాటారు. మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. పాడి రైతులు, జీవాల పెంపకం దారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, హుజూర్‌నగర్ పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది నాగరాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్‌కార్డుల పంపిణీ



చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు: కోదాడ డివిజన్‌లో శుక్రవారం నుంచి ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. గురువారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డుల పంపిణీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న నడిగూడెం మండలంలో, 26న అనంతగిరి, 28న చిలుకూరు మండలంలో, 29న కోదాడ మండలం, 30న మునగాల మండలంలో రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ ధృవకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ,, ఆర్‌ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, శ్వేత పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది వేతనాలు మంజూరు చేయాలి

నడిగూడెం : పెండింగ్‌లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది వేతనాలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు మంజూరు కాకపోవడంతో సంబంధిత సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు కొరట్ల వెంకటేశ్వర్లు, నక్క పద్మ, రెడ్డి సులోచన, నెమ్మాది సుధాకర్, ఎస్కే మాసాంబి, ఆదిలక్ష్మి, విజయ, వెంకన్న, సీతారాంరెడ్డి, వీరాంజనేయులు, ఉషారాణి పాల్గొన్నారు.

చిన్నారుల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గురువారం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మామిడి రామారావు 12 మంది చిన్నారుల పేరుమీద రూ.3వేల చొప్పున పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేతులమీదుగా అందజేశారు. డబ్బులను వృథా చేయకుండా 12 మంది చిన్నారులకు రూ.3వేల చొప్పున డిపాజిట్ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్న రామారావును బొల్లం మల్లయ్య అభినందించారు. కార్యక్రమంలో పైడిమర్రి సత్యబాబు, అనంతు సైదయ్య, ఎస్‌కె.నయీం, కందుల కోటేశ్వరరావు, అల్వాల వెంకట్, సంపెట సీతయ్య, వీరబాబు, నాగుల్ పాల్గొన్నారు.

'గ్రామాల్లో గాడితప్పిన ప్రత్యేక అధికారుల పాలన'



మాట్లాడుతున్న భూక్యా పాండునాయక్

మఠంపల్లి: ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించడంతో పాలన గాడి తప్పిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండునాయక్ ఆరోపించారు. గురువారం మఠంపల్లిలోని సీపీఎం మండల కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వీడాలన్నారు. పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేయాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులైన వీధిలైట్లు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కుక్కల బెడద నివారణ చర్యలు తదితరాలకు ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయకుండా ప్రజలపై పన్నులు వసూలు చేసుకొని ఉపయోగించాలని కార్యదర్శులపై ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ నాయకులు శాగంరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, జాల తిరుపతయ్య, శంభయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం వైభవంగా నిత్యకల్యాణం నిర్వహించారు.. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామిని నూతన పట్టు వస్త్రాలంకరణ చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన ,పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ ,తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత శ్రీస్వామి అమ్మవారిని గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. పనులు కదలక



స్లాబ్ దశలో నిలిచిపోయిన చిలుకూరు పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు

- నిలిచిపోయిన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం
- రూ.21లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్

చిలుకూరు: చిలుకూరు పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. భవనం నిర్మాణానికి 2009లో స్థలం కేటాయించారు. 2020లో రూ.కోటి30లక్షల నిధులు మంజూరు చేయగా.. పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ మొదట గుంతల దశలో పనులు నిలిపివేశాడు. ఆ తరువాత తిరిగి ప్రారంభించి పిల్లర్ల దశ వరకు చేపట్టాడు. వీటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మళ్లీ పనులు నిలిపివేశాడు. మళ్లీ ఏడాది క్రితం ప్రారంభంకాగా.. స్లాబ్ వరకు పూర్తి చేశాడు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ రూ. 21లక్షలు వెచ్చించగా.. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా నేటికీ మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై ఇటీవల కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి తెలియజేయడంతో భవనాన్ని పరిశీలించారు. బిల్లులు మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా.. ఇప్పటికే పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి నలుగురు కాంట్రాక్టర్లు మారారు. పనులకు రెండు సార్లు రీ టెండర్లు జరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని పోలీసులు కోరుతున్నారు.

సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లా



ప్రస్తుతం చిలుకూరు పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మా శాఖకు సంబంధించిన అధికారులతోపాటు, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి భవనం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తాము. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– రజితారెడ్డి, కోదాడ రూరల్ సీఐ